క్లుప్తంగా

దేవాలయాల్లో పొంగులేటి పూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న పొంగులేటి, కుటుంబ సభ్యులు

కల్లూరు: పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను సమర్పించేందుకు సిద్ధమైన టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం మండలంలోని నారాయణపురం, కల్లూరులోని రామాలయం, శివాలయాల్లో కుటుంబ సభ్యులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తండ్రి రాఘవరెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పించారు. కల్లూరు ఎన్ఎస్‌పీలోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి భార్య మాధురి, కుమారుడు హర్ష, కుమార్తె స్వప్నిరెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు కొండూరు సుధాకర్, కాటేపల్లి కిరణ్‌కుమార్, నోటి కృష్ణారెడ్డి, ఉబ్బన శ్రీను చందు, మైబు, అఖిలాష్, కీసర మధు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

వేంసూరు: తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి భారతీయ జనత పార్టీతోనే సాధ్యమని సత్తుపల్లి బీజేపీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని మర్లపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కులాల అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్రంలోని కుటుంబ పార్టీలను సాగనంపేందుకు బీజేపీకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ని వీరంరాజు, పార్టీ మండల అధ్యక్షులు పర్సా రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మట్టా ప్రసాద్, భీమిరెడ్డి బాలకృష్ణ రెడ్డి, నరేస్ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్: హైద్రాబాద్‌లో ఈ నెల 11న మాదిగ ఉపకులాల ఏబీసీ వర్గీకరణ కోసం జరిగే విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గోళ్ల మూడి శ్రీనివాసరావు, పరిగడుపు లక్ష్మణ్‌లు కోరారు. సత్తుపల్లిలో శనివారం జరిగిన సమావేశంలో విశ్వరూప మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభకు ప్రతీ గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని, వర్గీకరణ జరిగితే భావితరాల భవిష్యత్ కోసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ ఎస్సీ వర్గీకరణ జరగనంత కాలం ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఒరిగేది ఏమి లేదన్నారు. కార్యక్రమంలో అర్జున్, అశోక్, దాసు, దేవన్న, విష్ణు, వినోద్ పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండురోజుల పాటు జరిగిన మండల స్థాయి జూనియర్ కళాశాలల ఆటల పోటీల్లో సత్తుపల్లి శాంతినికేతన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వాలీబాల్, ఖోఖో, 100మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్‌లలో ప్రథమ బహుమతి సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దొడ్డా శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎం.మహేంద్రారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కొణిజర్ల: రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీలకు కొణిజర్ల మండలం పెద్దగోపతి గ్రామానికి చెందిన బండ కార్తీక ఎంపికయ్యింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కార్తీక రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మార్క్, ఉపాధ్యాయులు.. విద్యార్థినితో పాటుగా పీఈటీ షేక్ రంజాన్‌ను అభినందించారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

వైరారూరల్: వైరా రిజర్వాయర్‌కు సాగర్ విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరారు. శనివారం ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. సాగునీరు అందక ఆయకట్టు పరిధిలో సుమారు 25వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. దీంతో స్పందించిన నామా.. కలెక్టర్ వీ.పీ గౌతమ్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ మురళిధర్‌లతో ఫోన్లో రైతుల సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రావు, సింహాద్రి, పిచ్చయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వరి పైరు ఎండుతోంది

- కాల్వల్లో నీరు రాక రైతుల అవస్థలు
- 22 వేల ఎకరాల్లో వరిసాగు
- 30 శాతం పైగా ఎండిపోతున్న పైనం

తల్లాడ: ఈ ఏడాది నాగార్జున సాగర్ కింద సాగు చేసిన వరి పైరుకు నీరందక ఎండిపోతుంది. ఇప్పటికే 30 శాతానికి పైగా వరిపైరు వడబడిపోయి ఎందుకు పనికిరాకుండా పోయింది. మరో 20 శాతానికి పైగా పైరు పరిస్థితి కూడా అంతే ఉంది.

22 వేల ఎకరాల్లో వరిసాగు..

నాగార్జున సాగర్ కాల్వలు, చెరువుల, కుంటలు కింద మండల వ్యాప్తంగా 22 వేల ఎకరాల్లో వరిపైరు సాగు చేశారు. ఇందులో ఎన్నెస్పీ కింద 15వేల ఎకరాలు, చెరువులు, కుంటల కింద 7వేల ఎకరాల్లో సాగు చేశారు. చెరువులు, కుంటలు, బావులు, బోర్ల కింద వేసిన 7వేల ఎకరాల్లో పైరు ఆశాజనకంగా ఉండగా ఎన్నెస్పీ కింద వేసిన వరిపైరు మాత్రం 30 శాతానికి పైగా ఎండిపోయింది. మిగిలిన వరి పైరు కూడా నీటి కోసం నెర్రెలు చాచి ఉంది.

పశువులకు వదిలేసిన వరి పైరు..

తల్లాడ మండలంలో గత జులై చివరి వారం, ఆగస్టు మొదటి వారంలో సాగు చేసిన వరి పైరుకు సాగర్ నీరందక పంట వడబడి ఎండిపోయింది. దీంతో పొట్ట దశలో, కంకి దశలో ఉండాల్సిన తరుణంలో ఎండిపోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు. దీంతో వరి పొలాల్లో పశువులు మేపుతున్నారు. సిరిపురం, పుణ్యపురం, రామచంద్రాపురం, గూడూరు మేజర్ల కింద ఈ పరిస్థితి నెలకొంది.

వెదజల్లే పద్ధతిలో 13 వేల ఎకరాలు సాగు..

ఈ సంవత్సరం ఖరీఫ్‌లో రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశారు. సాంబ మసూరు 1,262.. 1,061 ఇన్‌ఫుట్ సాంబమసూర వరిని సాగు చేశారు. వెదజల్లే పద్ధతిలో వరిని సాగు చేయడం వల్ల వర్షాలు సరిగా కురవక, అటు సాగర్ నీరు విడుదల కాక వరి పైరు వడబడి ఎండిపోయింది. వెదజల్లే పద్ధతిలో వరికి ఆరు తడి పంటల మాదిరిగా నీరు పెట్టాల్సి ఉండగా నాగార్జున సాగర్‌లో డెడ్ స్టోరేజ్ ఉండటం వల్ల కాల్వల్లో నీరు సరఫరా జరగక పోవటంతో సకాలంలో సాగు నీరు పెట్టలేకపోయారు. అన్నారుగూడెం, బిల్లుపాడు, కొత్త వెంకటగిరి, రేజర్ల, తెలగారం, వెంకటాపురం, గాంధీనగర్‌తండా, మల్సూర్‌తండా, నూతనకల్, బాలపేట, మిట్టపల్లి, పినపాక గ్రామాల్లో సాగు చేసిన వరి పైరు చేతికి రాకుండానే ఎండిపోయింది.



బిల్లుపాడులో ఎండిపోయిన వరిపైరు



కొత్త వెంకటగిరిలో వరిపైరును మేస్తున్న పశువులు

ఎకరానికి రూ.15 వేల వరకు పెట్టుబడి..

మండలంలోని రైతులు వరి పైరుకు ఎకరానికి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. దున్నడానికి, విత్తనాలు, ఎరువులకు కలిపి ఈ మొత్తం ఖర్చయింది. శ్రమ కాకుండా ఈ మొత్తం ఖర్చు అయినప్పటికీ పైరు చేతికి రాకుండా కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు బావుర మంటున్నారు.

దయనీయంగా కౌలు రైతుల పరిస్థితి..

కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు కౌలుకు తీసుకున్న రైతులు మరో రూ.15 వేలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేశారు. కౌలు ముందుగానే చెల్లించిన రైతులకు ఈ ఏడాది సాగర్ నీరు రాకపోవటంతో తీరని నష్టం వాటిల్లింది. దీంతో ఈ ఏడాది కౌలు రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోనున్నారు.

23 ఎకరాల్లో పైరు ఎండిపోయింది..



జులైలో.. 23 ఎకరాల్లో సాగు చేసిన వరి పైరు సాగర్ నీరందక ఎండిపోయింది. ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టాను. కాల్వ నీరు వస్తే పైరు చేతికొచ్చేది. కనీసం ఒకటి, రెండు తడులు కూడా అందకుండా పోయింది. కనీసం పొట్టదశలో కూడా నీరందలేదు. దీంతో వరిపైరు కళ్లముందే చూస్తుండగా వడబడి ఎండిపోతున్నా ఏం చేయలేకపోయాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– దీవెల వెంకటేశ్వరరావు, రైతు, కొత్త వెంకటగిరి

నష్ట పరిహారం చెల్లించాలి..



ఖరీఫ్‌లో ఎనిమిది ఎకరాల్లో పంట సాగు చేశాను. ఎనిమిది ఎకరాల్లో సాగు చేసిన వరి పైరుకు నీరందక పూర్తిగా ఎండిపోయింది. దీంతో వరిపైరుపై ఆశలు వదులుకున్నాను. గతేడాది కూడా ఇదే పరిస్థితి ఎదురైతే రైతుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం సాగర్ నీరు విడుదల చేసింది. ఈ ఏడాది నీరు ఇంత వరకు రాలేదు. దీంతో వరిపైరు ఎండిపోయింది. వరి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి.

– కర్లకంటి భూషణం, రైతు, బిల్లుపాడు

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

మధిర: ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నెల 30న ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ మేడా ముత్తయ్య కళాబృందం శనివారం అవగాహన కల్పించారు. మధిర రిటర్నింగ్ కార్యాలయం వద్ద ఈ కళాజాత కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారి గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని తెలిపారు. ఈ నెల 13 వరకు మధిర నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కళాజాతా విస్తృత ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. డబ్బులు, మద్యం ఇస్తున్నట్లు సమాచారం అందితే సివిజిల్ యాప్ ఉపయోగించాలని చెబుతూ కళాకారులు నాటికలు, పాటలు, కళా ప్రదర్శన ద్వారా ఓటర్లకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించారు. మధిర పట్టణంలోని సుందరయ్య నగర్, మండలంలోని రామచంద్రాపురం గ్రామాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో మధిర సీఐ వసంత్ కుమార్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమక్షంలో కళాకారుల ప్రదర్శన

చికిత్స పొందుతూ మహిళ మృతి

కారేపల్లి: పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మహిళ ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకిట్యాతండా గ్రామానికి చెందిన బాధావత్ కాంతి (40) కడుపునొప్పితో గత కొంతకాలంగా బాధపడుతుందని, ఈ క్రమంలో కడుపునొప్పి తాళలేక ఈ నెల 3న పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు, మృతురాలి కుమారుడు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై పి.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. మృతురాలి భర్త ఏడాది కిత్రమే అనారోగ్యంతో మృతి చెందగా.. ఇద్దరు కుమారులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

తల్లాడ: మండలంలోని పాత మిట్టపల్లి గ్రామంలో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. సత్తుపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా సండ్ర వెంకటవీరయ్యను నాలుగో సారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎర్రుపాలెం/చింతకాని: మండల కేంద్రాల్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్‌ను గెలిపించాలని ఎర్రుపాలెంలో, చింతకాని మండలంలోని నేరేడ గ్రామంలో ఇంటింటి తిరుగుతూ.. బీఆర్ఎస్ మేనిఫెస్టో వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలల్లో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, మండల కమిటీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు, ఎంపీపీ శిరీష, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ మస్తాన్ వలీ, నాయకులు ఉన్నారు.

ఘనంగా మారెమ్మ ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కారేపల్లి: మండలంలోని కొత్తకమలాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మతల్లి దేవాలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నాగసాయిశర్మ, సురేష్ శర్మల ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల నడుమ గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేశా

మధిర: ఆంధ్ర సరిహద్దులో ఉన్న మధిరలో తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేశానని తెలంగాణ ఉద్యమకారుడు బొమ్మెర రామ్మూర్తి అన్నారు. బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా శనివారం ఆయన మధిరలో నామినేషన్ దాఖలు చేశారు. అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించి కన్నీటి పర్యంతమయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. తన అభిమానులతో కలిసి ర్యాలీగా తరలివచ్చి నామినేషన్ వేశారు. కార్యక్రమంలో బొబ్బిళ్ల పాటి బాబురావు, శీలం వీర వెంకటరెడ్డి, తాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

సత్తుపల్లిటౌన్: కార్తీకమాసం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అరుణాచలం, శబరిమలైకు సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అరుణాచలానికి ఈ నెల 25న సత్తుపల్లి డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి 28న తిరిగి చేరుకుంటుందన్నారు. భక్తులు ముందస్తు రిజర్వేషన్ కోసం 99599 సర్వీస్ నంబర్‌తో రిజర్వేషన్ చేయించుకోవాలని తెలిపారు. అదే విధంగా శబరిమలై వెళ్లే భక్తుల కోసం 35 సీట్లు ఉంటే సూపర్ లగ్జరీ బస్సును కిలో మీటర్‌కు రూ.65లకు ఇచ్చేందుకు ఆర్టీసీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దొరికిన సెల్‌ఫోన్ అప్పగింత

మధిరరూరల్: వారం రోజుల క్రితం ఒక వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మధిర రూరల్ పోలీసులు గుర్తించి బాధితునికి శనివారం అప్పగించారు. దెందుకూరు ఎంపీటీసీ సభ్యుడు హల్లు అంకబాబు కుమారుడు ప్రశాంత్ ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సాంకేతిక నైపుణ్యం ఆధారంగా మధిర రూరల్ ఎస్సై రఫీ ఆ సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితునికి అప్పగించారు. సుమారు రూ.35 వేలు విలువచేసే సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకొని తనకు అప్పగించిన ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

బెల్ట్‌షాపులో ఎక్సైజ్ అధికారుల దాడులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామానికి చెందిన దూపకుంట్ల రాఘవయ్యకు చెందిన బెల్ట్‌షాపులో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ సీఐ వేమా రాజశేఖర్‌రావు బెల్ట్‌షాపును తనిఖీ చేశారు. ఈ క్రమంలో రూ.30వేలు విలువైన మద్యం సీసాలు పట్టుబడడంతో.. మద్యం సీసాలను సత్తుపల్లి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై అల్లూరు సీతారామరాజు, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: ఇటీవల ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో కాలు కోల్పోయిన బాధితుడికి శనివారం కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు.

ఉపసర్పంచ్..

ఏన్కూరు: మండలంలోని శ్రీరామగిరిలో ఆరికాయలపాడు గ్రామ ఉప సర్పంచ్ గుడ్ల వెంకటేశ్వర్రావు పలు కుటుంబాలను శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. శ్రీరామగిరి ఎస్సీకాలనీకి చెందిన కొలకాని చిట్టిబాబు చెట్టుపై నుంచి కిందపడి బలమైన దెబ్బలు తగిలి గత రెండు సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యాడు. అదే గ్రామానికి చెందిన గుండ్ర వెంకటి భార్య మరియమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతుండగా ఇరు కుటుంబాలకు సాయం అందజేశారు. కార్యక్రమంలో సాగర్, రామారావు, భాస్కర్, ధనమ్మ, రాంబాబు, రామారావు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

వైరారూరల్: మండలంలోని తాటిపూడి పంచాయతీకి శివారు గ్రామమైన జింకలగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొల్లా రాంబాబు కుమార్తె సాయి శరణ్య జన్మదిన వేడుకలను పురస్కరించి నోట్ పుస్తకాలు, పెన్నులు, ఇతర రాత సామగ్రితో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేంద్రరావు, హెచ్ఎం.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కల్లూరురూరల్: మండలంలోని ఎర్రబంజరులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మమత పశువుల ఎదుగుదలకు సంబంధించిన లక్షణాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, వీఎల్ఓ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, హనుమంతు, కృష్ణప్రసాద్, అప్పారావు, శివకృష్ణ, మాధవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

ముదిగొండ/చింతకాని: బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాన్ని ముదిగొండ, చింతకాని మండలాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు శనివారం పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధిరలో బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్, రైతు సమితి మండల కన్వీనర్ ప్రసాద్, జెడ్పీటీసీ తిరుపతి కిషోర్, వైస్ ఎంపీపీ హనుమంతురావు, గ్రామసర్పంచ్ ఝాన్సీ, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు రమేష్, మండల అధ్యక్షుడు రత్నాకర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు పాల్గొన్నారు.



ముదిగొండ: ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కొండబాల కోటేశ్వరరావు

వైరా, సత్తుపల్లిలో ఒక్కోటి.. మధిరలో రెండు

సత్తుపల్లిలో తొలి నామినేషన్ దాఖలు..



నామినేషన్ దాఖలు చేస్తున్న అంబోజు సుమలత(ఏడీఆర్)

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫామ్స్(ఏడీఆర్) పార్టీ నుంచి అంబోజు సుమలత శనివారం రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తికి నామినేషన్‌ను సమర్పించారు. దీంతో సత్తుపల్లి నుంచి తొలి నామినేషన్ దాఖలైనట్లైంది.

వైరాలో ఒకటి..



ఆర్ఓ సత్యప్రసాద్‌కు నామినేషన్ పత్రం అందజేస్తున్న వర్సా రాములు

వైరా: వైరాలో శనివారం ఒక నామినేషన్ దాఖలు అయ్యింది. యూసీసీఆర్ఐ ఎంఎల్ పార్టీ అభ్యర్థిగా చెప్పుకుంటున్న వర్సా రాములు శనివారం ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే సదరు పార్టీకి గుర్తింపు లేదని ఆర్ఓ సత్యప్రసాద్ తెలపడంతో పర్సారాములును ఇండిపెండెంట్‌గా గుర్తించనున్నట్లు తెలిపారు.

మధిరలో రెండు నామినేషన్లు..



మధిరలో నామినేషన్ వేస్తున్న బలవంతపు కల్యాణ్ కుమార్

మధిర: మధిర నియోజకవర్గ స్థానానికి శనివారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మొట్టమొదటి నామినేషన్ పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బలవంతపు కల్యాణ్ కుమార్ ఒక సెట్ నామినేషన్, అదేవిధంగా బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా బొమ్మెర రామ్మూర్తి మరొక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.



నామినేషన్ వేస్తున్న బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థి బొమ్మెర రామ్మూర్తి

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



ఏన్కూరు: వృద్ధుడిని ఓటు అడుగుతున్న మదన్‌లాల్

తల్లాడ/ఏన్కూరు : తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని మునియాతండాలో ఎమ్మెల్యే రాములు నాయక్‌తో కలిసి ప్రచారం ప్రారంభించారు. తొలుత నాచారం గ్రామంలో అద్భుత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి.. మండలంలోని మునియా తండా, ఒంటిగుడిసె, రామతండా, గంగుల నాచారం, కాలనీనాచారం, మేడేపల్లి, రాజులపాలెం, హిమామ్‌నగర్, అక్కినాపురం తండా, భగవాన్ నాయక్ తండా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో మదన్‌లాల్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి బంగారు తెలంగాణ సాధన అడుగులు వేసినట్లు చెప్పారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మూడో సారి మళ్లీ కేసీఆర్ సీఎం అయి హ్యాట్రిక్ సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాదావత్ బుజ్జి, బాలాజీ, రైతుబంధు మండల కన్వీనర్ దర్మారావు, సురేష్, వెంకయ్య, మోహన్‌రావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, హరికృష్ణ, నవీన్, నాగరాజు, చందులాలు నాయక్, అజ్మీరా రైలు, పటాన్ జలాల్ ఖాన్, కోటేశ్వరరావు, రమేష్, వెంకన్న, నాగేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అండగా నిలుస్తా

వేంసూరు: మరోసారి ఆశీర్వదించండి.. అన్ని విధాలుగా అండగా ఉంటానని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శనివారం మండలంలోని మర్లపాడు, ఎర్రగుంట, అమ్మపాలెం, వేంసూరు, లింగపాలెం, భీమవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదిహేనేళ్లుగా సత్తుపల్లి అభివృద్ధే లక్ష్యంగా ప్రజల మధ్యనే ఉంటూ పనిచేస్తున్నానని తెలిపారు. తను చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందే కనిపిస్తుందని మాయమాటలు చెప్పే వారిని నమ్మి మోసపోవద్దని అన్నారు. ప్రజలకు అన్ని సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దీవించి హ్యాట్రిక్ విజయం అందించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని చీకటి మయంగా చేస్తారని అన్నారు. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, పాలా వెంకటరెడ్డి, మందపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఎండీ పైజుద్దీన్, యర్ర రమేష్, మారోజు సురేష్ నీలపాల నరసింహారావు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట వీరయ్య

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



సత్తుపల్లిటౌన్: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ మట్టా రాగమయి

ఎర్రుపాలెం/సత్తుపల్లిటౌన్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని మల్లు సూర్య విక్రమాదిత్య, కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. శనివారం ఎర్రుపాలెం మండలంలోని రామన్నపాలెం, ఇనగాలి, ములుగుమాడు, సఖినవీడు గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ ప్రతాపరెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే విధంగా సత్తుపల్లిలోని ద్వారకాపురి కలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తుందన్నారు. మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్లు భట్టి విక్రమార్కకు ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంబాబు, వెంకటరెడ్డి, నర్సింహారావు, లక్ష్మణరావు, తిరుపతమ్మ, బ్రహ్మయ్య, వెంకట కృష్ణారావు, బాబురావు, ఇస్మాయిల్, జానీభాషా, శ్రీను, సాయికుమార్, ఉమామహేశ్వరి, ప్రసాద్‌రెడ్డి, వెంకటనారాయణ, పిచ్చిరెడ్డి, నాగేశ్వరరావు, రమేష్, ఎండీ కమల్‌పాషా, రఫీ, మోరిశెట్టి సాంబశివరావు, నాగేశ్వరరావు, మానుకోట ప్రసాద్, సందీప్‌గౌడ్, భరత్ తదితరులు ఉన్నారు.

బీఎస్పీ అభ్యర్థిగా వెంకటేశ్వరరావు

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా శీలం వెంకటేశ్వరరావును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శనివారం ప్రకటించారు. కల్లూరు పట్టణానికి చెందిన వెంకటేశ్వరరావు అంబేద్కర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. ఎంఎస్‌డబ్ల్యూ పూర్తి చేసిన ఆయన భార్య వాడేపల్లి నాగమణి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ఇద్దరు సంతానం ఉన్నారు.



శీలం వెంకటేశ్వరరావు

కేంద్రం ఇబ్బందులకు గురిచేస్తోంది

సత్తుపల్లిటౌన్: ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. సత్తుపల్లిలో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేరళ వామపక్ష ముఖ్యమంత్రి విజయన్‌పై దొంగ బంగారం కేసులో ఇరికించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో శ్రామికుల పక్షాన నిలబడే ఎర్రజెండాను గెలిపించాలని పిలుపు నిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించేలా ప్రజా సంఘాలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 8న సత్తుపల్లిలో సీపీఎం ఎర్రజెండాలతో ఎర్ర దుస్తులు ధరించి భారీ ప్రదర్శనతో నామినేషన్ వేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మాచర్ల భారతి, మాదినేని రమేష్, చలమాల విఠల్, మోరంపూడి పాండు జాజిరి శ్రీను, శీలం సత్యనారాయణరెడ్డి, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు